క్లుప్తంగా

ఆత్మరక్షణకు కరాటే అవసరం



అభినందిస్తున్న మాజీ జెడ్పీటీసీ రమేశ్

సుల్తానాబాద్: ఆత్మరక్షణకు కరాటే దోహదప డుతుందని మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఆదివారం సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ 2024 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కప్‌లో పలువురు విద్యార్థులు జాతీయ బంగారు పతకాలు సాధించినందుకు వారిని అభినందించారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పరిధిలోని రాజాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీభక్త ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ విగ్రహ పున:ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి

సుల్తానాబాద్: పట్టణంలోని పెరిగిద్దె హనుమన్ ఆలయంలో శ్రీరామనవమి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి తెలిపారు. 17న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యంగా కలగకుండా ఉండేందుకు చుట్టుపక్కల ట్రాక్టర్ ద్వారా చదును చేయడమే కాకుండా చలువ పందిల్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



నగదు అందిస్తున్న మిత్రులు

ధర్మారం: మండలంలోని నర్సింహులపల్లికి చెందిన కొమురయ్య (43) నెలక్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆ కుటుంబానికి బాల్యమిత్రులు రూ.36వేలు అందించారు. 1995–96లో గోదావరిఖనిలోని శాతవాహన విద్యానికేతన్‌లో కొమురయ్యతో పాటు ముత్యాల రాంచందర్, మల్యాల రమేశ్, బొజ్జ నర్సింగం పదో తరగతి కలిసి చదువుకున్నారు. కొమురయ్య మరణంతో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నారని తెలుసుకున్న మిత్రులు ఆర్థికసాయం అందించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



సుల్తానాబాద్: బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పట్టణానికి చెందిన తోట వెంకటేశ్ సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

దళిత కార్మికులను చిన్నచూపు చూస్తున్నారు

రామగిరి: దళిత కార్మికులను సింగరేణి అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, ప్రోటోకాల్ పాటించకుండా అవమానాలకు గురిచేస్తున్నారని ఆర్జీ–3 ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కన్వీనర్ బత్తుల శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షాత్తు అంబేద్కర్ జయంతి ఉత్సవాల పేరిట దళిత ఉద్యోగులను జీఎం సుధాకర్‌రావు అవమానపరిచారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని శంకర్ తెలిపారు. ఈ విషయంపై జీఎం సుధాకర్‌రావును వివరణ కోరగా వారిపై ఎలాంటి వివక్ష చూపించలేదని, ఉత్సవాలలో ఏదైనా జరిగితే అందరితో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిలువేరి స్వామి అన్నారు. సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ శ్యాముల్‌జాన్, అసిస్టెంట్ కమిషనర్ కోల ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్మికుల నమోదు విషయంలో ఆన్‌లైన్ ఇబ్బందులు, డెత్ క్లెయిమ్‌లకు సంబంధించిన విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కారిస్తామన్నారని తెలిపారు. జనరల్ సెక్రటరీ బైరి శంకర్, కోశాధికారి ఎస్.కె.షరీఫ్ పాల్గొన్నారు.

పుచ్చకాయ సాగు.. లాభాలు బాగు

- దశలవారీగా దిగుబడి
- ఎర్ర, నల్ల, ఇసుక నేలలు అనుకూలం
- అంతర్గాం మండల పరిధిలో 12 ఎకరాల్లో సాగు





పుచ్చకాయ పంట సాగు, పుచ్చకాయ నాణ్యతను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి

రామగుండం: ఎండాకాలంలో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చాలా మంది పుచ్చకాయలు తింటారు. బహిరంగ మార్కెట్‌లో పుచ్చకాయలకు భారీగా డిమాండ్ ఉండడంతో రైతులు పుచ్చకాయల సాగుపై దృష్టి సారిస్తున్నారు. అంతర్గాం మండల పరిధిలో ఎల్లంపల్లి, బ్రాహ్మణపల్లి, విలేజి అంతర్గాం గ్రామాలకు చెందిన తొమ్మిది మంది రైతులు సుమారు 12 ఎకరాల్లో పుచ్చకాయ సాగు చేస్తున్నారు.

సాగు.. నేల స్వభావాలు

పుచ్చకాయ సాగుకు వేసవికాలం అనువైనది. ప్రస్తుతం మార్కెట్‌లో ఏడాది పొడవునా సాగు చేసుకునేలా అనువైన విత్తన రకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఒకేసారి దిగుబడి పొందకుండా దశలవారీగా సీజన్ పూర్తయ్యే వరకు దిగుబడి వచ్చేలా దశల వారీగా విత్తుకుంటే అదే స్థాయిలో దిగుబడి పొందవచ్చు. పుచ్చసాగుకు నీరు ఇంకే ఎర్ర, నల్లరేగడి, ఇసుక నేలలు సాగుకు అనుకూలం.

సాగుకు సిద్ధం చేసుకునే విధానం..

లోతు దుక్కులు, చివరి దుక్కులో ఎకరా విస్తీర్ణంలో గరిష్ఠంగా 10టన్నుల పశువుల ఎరువు, 150 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 25–30 కేజీల యూరియా/పొటాష్ చివరి దమ్ము చేసి విత్తుకు సిద్ధం కావాలి. పుచ్చసాగును బోదెల పద్ధతి, ఎత్తు బెడ్ల పద్ధతిలో విత్తుకుంటారు. రెండు వైపులా మొక్కల మధ్య 75సెం.మీ., సాలుకు మధ్యదూరం 120 సెం.మీ., విడిదిలో విత్తుకోవాలి.

సాగులో యాజమాన్య పద్ధతులు..

విత్తిన తర్వాత గరిష్ఠంగా 30రోజుల వ్యవధిలో ఎకరా విస్తీర్ణంలో గరిష్ఠంగా 32కేజీల యూరియా వేసుకోవాలి. 60రోజుల వ్యవధిలో ఎకరాకు 15కేజీల యూరియా/మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. మొక్కకు 3–4 ఆకులు ఉన్న సమయంలో లీటరు నీటిలో మూడు గ్రాముల బోరాక్స్ కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చేయాలి. పుచ్చసాగులో మల్చింగ్, డ్రిప్ విధానం సాగుతో దిగుబడి పెంచుకునే వీలుంటుంది.

కలుపు–నీటి యాజమాన్య పద్ధతులు..

విత్తనం నాటిన 48గంటల్లోగా లీటరు నీటిలో 5 ఎంఎల్, పెండి మిథాలిన్ కలుపుకొని పిచికారీ చేయాలి. వేసవిలో సాగు చేయడంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. డ్రిప్ పద్ధతిని ఉపయోగించి మొక్కలు నాటినప్పుడు ఉదయం, సాయంత్రం రోజుకు 30 నిమిషాల పాటు నీరందించాలి.

తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షణ చర్యలు..

పండు ఈగ లార్వాలు కాయలోకి చొప్పించి కుళ్లిపోయేలా చేస్తాయి. దీని నివారణకు పూత దశలోనే క్యూలూర్ ఎరలను ఏర్పాటు చేసుకోవాలి. క్యూలూర్ అందుబాటులో లేకుంటే 10లీటర్ల నీటిలో 100 ఎంఎల్, మాలాథియన్, 100గ్రాముల బెల్లం మిశ్రమాన్ని వెడల్పాటి పళ్లెంలో పోసుకొని చేనులో అక్కడక్కడా మిశ్రమాన్ని పోసి పెట్టుకోవాలి. దీంతో ఈగలు కాయను ఆశించకుండా ఉంటుంది.

ఎర్రనల్లి, తెల్లదోమ నివారణ పద్ధతులు..

ఎర్రనల్లి పురుగు ఆకు అడుగు భాగంలోకి చేరి రసాన్ని పీల్చుతూ పంటకు నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు ఎకరా విస్తీర్ణంలో లీటర్ నీటిలో 1.5ఎంఎల్, స్పైరోమెసిఫిన్, 3 ఎం.ఎల్, ప్రోపర్‌గైడ్ కలుపుకొని పిచికారీ చేయాలి. తెల్లదోమ సైతం రసాన్ని పీల్చి నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు లీటర్ నీటికి 3 ఎం.ఎల్, ఇమిడా క్లోపిడ్ లేదా రెండు గ్రాముల ఎసిటామిప్రిడ్ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ప్రస్తుత సీజన్‌లో రైతులు పుచ్చకాయ సాగుతో అధిక లాభాలు పొందవచ్చు. ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. అంతర్గాం మండల పరిధిలో ఎల్లంపల్లి, బ్రాహ్మణపల్లి, విలేజి అంతర్గాం గ్రామాలకు చెందిన తొమ్మిది మంది రైతులు సుమారు 12 ఎకరాల్లో పుచ్చకాయ సాగు చేస్తున్నారు. మల్చింగ్ విధానంలో చేసే పుచ్చసాగుతో మరిన్ని లాభాలు పొందవచ్చు. మల్చింగ్ విధానంలో సాగు చేస్తే ఎకరాకు రూ.6,400 ప్రభుత్వ సబ్సిడీ పొందే వీలుంటుంది. వివరాలకు ఫోన్ నంబర్ 77801 32284ను సంప్రదించవచ్చు. – జక్కుల శ్రీకాంత్‌యాదవ్, ఉద్యానవనశాఖ అధికారి

దశలవారీగా దిగుబడి..



ప్రస్తుతం పుచ్చకాయలకు డిమాండ్ ఉండడంతో ఎకరా విస్తీర్ణంలో సాగు చేస్తున్నా. దశల వారీగా విత్తుకోవడంతో దిగుబడి సైతం దశలవారీగా వస్తుండడంతో మార్కెటింగ్‌కు అనుకూలంగా ఉంది. ఎకరా విస్తీర్ణంలో సాగు చేస్తే గరిష్ఠంగా రూ.40వేల ఖర్చు అయింది. ఎకరా విస్తీర్ణంలో గరిష్ఠంగా 30టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు పేర్కొన్నారు. కేజీ పుచ్చకాయ సాగుకు గరిష్ఠంగా రూ.15 ఖర్చవుతుండగా బహిరంగ మార్కెట్‌లో రూ.40–45 వరకు కేజీ ధర పలుకుతుంది.

– నక్క మల్లేశ్, ఎల్లంపల్లి రైతు

భక్తాంజనేయస్వామి ఆలయంలో మంత్రి పూజలు



పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పరిధి రాజాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీభక్త అంజనేయస్వామి ఆలయాన్ని సోమవారం మంత్రి శ్రీధర్‌బాబు దర్శించుకున్నారు. అనంతరం గుండారం గ్రామానికి చెందిన జంగిలి అంజిని పరామర్శించారు. రాజాపూర్ శివారులోని వరిపంటలు ఎండిపోతున్నాయని, రెండురోజుల పాటు డి–83 కెనాల్‌తో సాగునీరు విడుదల చేయాలని గుండారం మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి నీటి విడుదల చేయిస్తానని మంత్రి అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, మాజీ సర్పంచ్‌లు అడ్వాల చంద్రయ్య, కట్కం రవీందర్, నాయకులు పిడుగు శంకర్, వడ్లకొండ మల్లేశ్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

గోదావరిఖనిటౌన్: ప్రైవేట్ కలర్ ల్యాబ్‌లో గుమస్తాగా పనిచేసే స్థానిక గంగానగర్‌కు చెందిన సోఫియా భేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం రూ.1.60లక్షల విలువైన చెక్కును అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, కార్యదర్శి దమ్మాల తులసి చేతుల మీదుగా ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘం రాష్ట్ర సభ్యులు హుస్సేన్, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, శైలేందర్, బొలుగూరి నాగరాజుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గోదావరిఖని అసోసియేషన్ నాయకులు శనిగరపు మల్లేశ్, బండారి ప్రసాద్, పోగుల విజయ్, వనపర్తి శ్రీనివాస్, దుస్స మహేశ్, తొగటి శ్రీధర్, రామగిరి శ్రీనివాస్, కోడి రామకృష్ణ, రెడ్డి శ్యాంప్రసాద్, విక్రమ్, శేఖర్, రాకేశ్, అజయ్, నవీన్ పాల్గొన్నారు.

'అన్నా వివేక్ కాదు.. వంశీ'



జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సహా జిల్లా మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు ధర్మపురి, చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతున్న సందర్భంలో 'కాంగ్రెస్ కార్యకర్తలందరూ సమష్టిగా కృషిచేసి మన గడ్డం వివేక్‌ను ఎంపీగా గెలిపించాలి' అనగానే అందరూ ఒక్కసారి నవ్వుకున్నారు. వెంటనే జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ 'వివేక్ కాదన్నా.. వంశీకృష్ణ' అనగానే ఇంకా ఎంపీగా వివేక్‌ను మర్చిపోలేదని విజయరమణారావు కార్యకర్తలతో పంచుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పదహారు గ్రామాల్లో మంగళవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఎన్పీడీసీఎల్ ఏఏఈ ఆశ శంకర్ పేర్కొన్నారు. ఆకెనపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు చెందిన 11 కేవీ ప్రత్యేక ఫీడర్ పనులు చేపట్టనుండడంతో అంతరాయం కలగనుందని తెలిపారు.

హైస్కూల్‌లో లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం జెడ్పీ హైస్కూల్‌లో లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. జెడ్పీ హైస్కూల్‌లో ఆత్మరక్షణ ప్రశిక్షణ సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. మూడు నెలలుగా ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని విద్యార్థులకు కరాటే మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు, జయరాజ్, ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు శ్రీనివాస్, కరాటే కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలకు చెందిన 2002–03లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ టంగుటూరి రాజయ్య, ఉపాధ్యాయులు విజయ, అన్నపూర్ణ, మారం కొమురయ్య, కృష్ణ, శ్రీనివాస్, కుమార్, అశోక్, పూర్వ విద్యార్థులు సతీశ్, నాగరాజు, శంకర్, ప్రశాంత్, వెంకటేశ్, మహేందర్, రమేశ్, ప్రీతి, స్వప్న, లావణ్య, ప్రతిభ, రజిత, సంధ్యారాణి పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

మంథని: ముత్తారం మండలం సీతంపేట బ్రిడ్జి వద్ద ఇసుక క్వారీలపై దౌర్జన్యం చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కొమురెల్లి మంథని పోలీసులకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మంథని నుంచి ముత్తారం మండలం ఖమ్మంపల్లికి వెళ్లేదారిలో బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా వసూలు చేస్తున్నారని తెలిపారు.

ఈజీఎస్ అక్రమాలపై విచారణ జరపండి

పెద్దపల్లిరూరల్: ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సీపెల్లి రవీందర్ కోరారు. సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మొగిలి, అనిల్, సంపత్‌కుమార్, వినోద్, నారాయణ, ప్రశాంత్ ఉన్నారు.

ఖాళీ చేసేందుకు కుటిల ప్రయత్నాలు

గోదావరిఖని: ఓల్డ్ అశోక టాకీస్ పక్కనే ఉన్న షాపును ఖాళీ చేసేందుకు కావాలనే నిప్పంటించి కుటిలయత్నాలు చేస్తున్నారని వేముల అశోక్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూల్చివేసిన అశోక్‌థియేటర్ సమీపంలో ఆదివారం రాత్రి కూలర్‌షాపు వెనకాల గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారన్నారు. దీంతో షాపునకు సంబంధించిన ప్లాస్టిక్ స్పేర్‌పార్టులు దగ్ధం అయ్యాయన్నారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. ఈ వివాదం హైకోర్టులో ఉండగా పొమ్మనలేక పొగబెట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. పోలీసులు స్పందించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో గల శివపంచయాతన భక్తాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం ధ్వజస్తంభం శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు కలిగి ఉన్న అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గర్రెపల్లిలో సోమవారం ఓటరు అవగాహన సదస్సు చేపట్టారు. ఎంపీడీవో దివ్యదర్శన్, ఆర్‌ఐలు శ్రీవాణి, స్వాతి ఉన్నారు.

ఘనంగా పడిపూజ

యైటింక్లయిన్‌కాలనీ: విషు పూజ మహోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మహాపడి పూజ నిర్వహించారు.

ఓబీ పనులు నిలిపివేత

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 విస్తరణలో భాగంగా నిర్వహిస్తున్న ఓబీ పనులను సోమవారం నిలిపివేశారు. లద్నాపూర్ గ్రామానికి చెందిన భూనిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వచ్చే వరకు సింగరేణి సంస్థ నిర్వహించే పనులను జరగనివ్వబోమని కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. గతంలో లద్నాపూర్ గ్రామంలో పోచమ్మ విగ్రహాన్ని తొలగించడంతో గ్రామస్తుల ఆందోళనతో పునఃప్రతిష్ఠించగా ఆదివారం నుంచి పదిరోజుల పాటు బోనాలు నిర్వహిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయం వద్ద బోనాల ఉత్సవాలు నిర్వహించడంతో పాటు పనులు చేస్తే ఆందోళన చేస్తామని గ్రామస్తులు సింగరేణి సంస్థకు గతంలోనే తెలిపారు. తమకు ప్యాకేజీ వచ్చే వరకు పనులు సాగనివ్వబోమని భూనిర్వాసితులు తెలపడంతో అధికారులు గతంలోనే వెనుదిరిగారు. సోమవారం ఓసీపీ–2 విస్తరణ ఓబీ పనులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం ఓబీపనులు నిలిపివేసింది. పని ప్రదేశంలోని 2 షావెల్, 20 డంపర్లను వెనక్కి మళ్లించారు. ఈ విషయంపై ఓసీపీ–2 పీవో రాజేందర్ వివరణకు ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రేకుర్తిలో 25మందికి కంటి శస్త్రచికిత్స

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నుంచి లయన్స్‌క్లబ్ ఆఫ్ విజన్‌కేర్ ఆధ్వర్యంలో 25మందికి ఉచిత కంటి శస్త్రచికిత్స చేయిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దత్తాగౌడ్ తెలిపారు. సోమవారం వీరిని రేకుర్తి ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు.

ఇసుక రీచ్‌లను రద్దు చేయాలి



సంఘీభావం తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి మానేరు వాగులో ఇసుక రీచ్‌లను రద్దు చేయాలని గ్రామస్తులు రిలే నిరసన దీక్ష చేస్తుండగా సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ భూగర్భజలాల పరిరక్షణ కోసం తాగు, సాగు నీటి కోసం తక్షణమే ఇసుక రీచ్‌లను రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రేమ్‌చందర్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, మనోజ్‌గౌడ్, సూరశ్యాం, శంకర్, రాజమౌళి, రమణ, రాజారాం ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



తనిఖీ చేస్తున్న ఆర్డీవో హనుమానాయక్

రామగిరి: దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని మంథని ఆర్డీవో హనుమానాయక్ రైతులకు సూచించారు. మండలంలోని రత్నాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ రాంచందర్‌రావుతో కలిసి తనిఖీ చేశారు. రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం అమ్మకాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తాగునీటి సమస్య రాకుండా కొనుగోలు కేంద్రాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాకేశ్‌రెడ్డి, ఏపీఎం స్వరూపరాణి, సీసీ రమేశ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గోదావరిఖనిటౌన్: అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



మంథనిలో..

గోదావరిఖనిటౌన్: ఈ నెల ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్ని ప్రమాదాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలో వివరించారు. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లకు దూరంగా ఉంచాలన్నారు. ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకుంటున్నప్పుడు పరుగెత్తకుండా నేలపై దొర్లాలని లేదా దుప్పటి చుట్టుకోవాలని సూచించారు. ఇంట్లో ఆయిల్ ఫైర్ ప్రమాదం జరిగినప్పుడు తడి చెద్దరితో ఎలా మంటలు ఆర్పాలో ఫైర్ సిబ్బంది చేసి చూపించారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం, సెక్యూరిటీ హెడ్ వలీ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

మంథని బస్టాండ్‌లో..

మంథని: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంథని అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి సదానందం సోమవారం అవగాహన కల్పించారు. బస్సు డిపో, బస్టాండ్‌లో అవగాహన కల్పించారు. డిపో మేనేజర్ రాజశేఖరం, కుమారస్వామి, భాస్కర్, లక్ష్మి మల్లు ఉన్నారు.

రాముని జీవితం ఆదర్శం



మాట్లాడుతున్న గుమ్మల సత్యంజీ

గోదావరిఖనిటౌన్: సమాజానికి, సమస్త మానవాళికి రాముని జీవితం ఆదర్శమని, ప్రతి కుటుంబంలో పిల్లలకు రామాయణం విశిష్టతను తెలియజేయాలని భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యంజీ అన్నారు. హిందూవాహిని ఆధ్వర్యంలో ఉగాది నుంచి హనుమాన్ జయంతి వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే శ్రీరామ మహోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక శారదానగర్‌లోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం మూడు నెలలుగా విశ్వహిత సేవాసమితి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రాంత గోరక్ష ప్రముఖ ఇసంపల్లి వెంకన్న, నగర కార్యదర్శి మేడగోని రవీందర్, జిల్లా సహ కార్యదర్శి బండ సమ్మన్న, సత్యం, జిల్లా కోశాధికారి నేరేడుకొండ వెంకటస్వామి, ఆరెల్లి జలందర్, కొండపర్తి లింగన్న, సంపత్, చక్రపాణి, అంజన్న, కుట్టు శిక్షకురాలు ఆరెల్లి మమత, భవానీ, తిరుమల, లలిత, రజిత పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక శ్రామికభవన్‌లో ఏర్పాటు చేసిన వామపక్ష పార్టీల జిల్లా సదస్సులో మాట్లాడారు. బొగ్గు బ్లాకులను ప్రైవేట్‌పరం చేస్తూ బడా పెత్తందార్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తాండ్ర సదానందం, వై.యాకయ్య, ఇ.నరేశ్, కె.విశ్వనాథ్, తోకల రమేశ్, కె.కనకరాజ్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు మేలు జరగలేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పాలకుర్తి: పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి మేలు చేకూరలేదని కాంగ్రెస్ మండల నాయకులు ఆరోపించారు. సోమవారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్ మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి మేలు చేయని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రస్తుతం ఎంపీ ఎన్నికల నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ సర్పంచ్ మల్లెత్తుల శ్రీనివాస్ నాయకులు తలారి శంకర్, వేల్పుల రాజ్‌కుమార్, అరుకాల సతీశ్, సూర సంతోష్, తువ్వ సతీశ్‌యాదవ్, భూతగడ్డల రమేశ్, సాగర్‌గౌడ్, భూంరెడ్డి, నార సత్తయ్య, తిప్పని చంద్రమౌళి, షకీలాల్ నాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. రుద్రారంకు చెందిన వేద పండితులు శ్రీవిష్ణువర్ధనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం నిర్వహించి పూజలు చేశారు. బత్తుల తిరుపతి–వనజ దంపతులు మూల విగ్రహాలు అందజేయగా టీసీ కాలనీకి చెందిన సూర సంతోష్ ధ్వజస్తంభాన్ని ఆలయానికి అందజేశారు. బసంత్‌నగర్‌కు చెందిన వ్యాపారి పాత నాగభూషణం దంపతులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుండేటి శంకరయ్య, కాల్వ అంజయ్యయాదవ్, బుర్ర మధునయ్య, బండి రవి, గుండేటి నర్సయ్య, కాల్వ తిరుపతి, శ్రీనివాస్ మొక్కులు చెల్లించారు.

ఆలయాన్ని సందర్శించిన మంత్రి, ఎమ్మెల్యే

మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధి కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేస్వామి ఆలయాన్ని సోమవారం మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి సందర్శించారు. నాయకులు తిరపతియాదవ్, సమ్మయ్య, అంజయ్య యాదవ్, మహంకాళి స్వామి, శశిభూషణ్, గొసియాబేగం పాల్గొన్నారు.